بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 10 October 2025 (Telugu)

# మక్కా విజయం తర్వాత సంభవించిన యుద్ధాలతో పాటు తబూక్ యుద్ధ నేపథ్యంలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.10.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రే) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా విజయానంతరం మదీనాకు తిరిగి వచ్చిన తర్వాత కూడా వారికి ఎదురైన కొన్ని దండయాత్రలను ఇప్పుడు నేను ప్రస్తావింతును.

అందులో ఒకటి సరయ్యా కైస్ బిన్ సాద్ బిన్ ఉబాదా గలదు. ఇది హిజ్రీ ఎనిమిదవ సంవత్సరంలో జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జి'రానా నుండి మదీనాకు తిరిగి వచ్చినప్పుడు, ఆయన ఇస్లాం వైపు ఆహ్వానించుటకు వివిధ ప్రాంతాలకు సైన్యాలను పంపారు. ఇందులో భాగంగా ముహాజిర్ బిన్ అబీ ఉమయ్యాను సనా వైపు, జియాద్ బిన్ లబీద్‌ను హజ్రమౌత్ వైపునకు పంపారు. ఇందుకు ఒక సైన్యాన్ని సిద్ధం చేసి, దానికి నాయకుడిగా కైస్ బిన్ సాద్‌ను నియమించారు. యెమెన్‌లోని సదా తెగ వారిని ఇస్లాం వైపు ఆహ్వానించడానికి ఆయన కైస్ బిన్ సాద్‌ను నాలుగు వందల మందితో పంపారు. హజ్రత్ కైస్, ఖజ్రజ్ తెగ నాయకుడైన హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజియల్లాహు అన్హు) కుమారుడు. ఆయన చాలా సరైన అభిప్రాయం గలవారిగా, ధైర్యవంతుడైన అశ్వికుడిగా పరిగణించబడ్డారు. ఆయన దాతృత్వం, ఔదార్యం కోసం కూడా చాలా ప్రసిద్ధి చెందారు. ఆయన 'ఖనాహ్' లో విడిది చేసి ఉన్నారు. ఆ సమయంలో సదా తెగకు చెందిన ఒక వ్యక్తి జియాద్ బిన్ హారిస్ అటుగా వెళ్లాడు. ఇతను కొంతకాలం క్రితం ఇస్లాంను స్వీకరించెను. ఈ సైన్యం తమ తెగపై దాడి చేయబోతోందని అతనికి తెలిసినప్పుడు, అతను నేరుగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, పంపబడిన సైన్యాన్ని వెనక్కి పిలిపించగలరని అభ్యర్థించాడు. తాను తన తెగ పట్ల హామీ ఇస్తానని, వారు ఇస్లాంను అంగీకరిస్తారని కూడా వాగ్దానం చేశాడు. దైవ ప్రవక్త (స) అతని అభ్యర్థనను అంగీకరించి, సైన్యాన్ని వెనక్కి పిలిపించారు. ఆ తర్వాత, వారు నెమ్మదిగా ఇస్లాంను బోధించినప్పుడు, వారు ఇస్లాంను కూడా స్వీకరించారు, ఎందుకంటే దాడి చేయడం, బలవంతంగా ముస్లింలుగా మార్చడం ఇస్లామీ బోధనకు, మహా ప్రవక్త (స) చర్య, సున్నత్‌కు కూడా విరుద్ధం. ఆయన సల్లం హజ్రత్ జియాద్‌నే వారికి నాయకుడిగా నియమించారు.

సరయ్యా హజ్రత్ ఉయైనా బిన్ హిస్న్ ఫజారీ. ఈ దండయాత్ర హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని ముహర్రం నెలలో బనూ తమీమ్ తెగ వైపు జరిగింది. దీని నేపథ్యం ఏమిటంటే, మహా ప్రవక్త (స) హజ్రత్ బిషర్ బిన్ సుఫ్యాన్‌ను బనూ కఅబ్ తెగ వైపు సదాఖాత్ (అనగా జకాత్ నిధుల) సేకరణ కోసం పంపారు. హజ్రత్ బిషర్ ఆజ్ఞపై బనూ ఖుజా'ఆ తెగ సంపద అన్ని వైపుల నుండి ఆయన వద్దకు

చేరడం ప్రారంభమైంది. ముస్లింలు కాని బనూ తమీమ్ తెగ వారికి ఈ సంపద చాలా ఎక్కువగా కనిపించింది, అప్పుడు వారు "ఇతను ఎందుకు అన్యాయంగా మా ఆస్తులను తీసుకుంటున్నాడు?" అని అంటూ తమ కత్తులను తీశారు. ఈ గొడవ, యుద్ధ వాతావరణాన్ని చూసి, హజ్రత్ బిషర్ ఎటువంటి వసూలు చేయకుండానే అక్కడి నుండి తిరిగి వచ్చి, దైవ ప్రవక్త (స)కు పరిస్థితుల గురించి తెలియజేశారు. దైవ ప్రవక్త (స) హజ్రత్ ఉయైనా బిన్ హిస్న్‌ను యాభై అరబ్ అశ్వికులతో బనూ తమీమ్ తెగ వైపు పంపారు. ఆయన తన సహచరులతో కలిసి బనూ తమీమ్ నివసిస్తున్న, తమ పశువులను మేపుతున్న కంచె ప్రాంతానికి చేరుకున్నారు. బనూ తమీమ్ ఈ సైన్యాన్ని చూడగానే, అంతా వదిలి అక్కడి నుండి పారిపోయారు. వారిలో పదకొండు మంది పురుషులు, పదకొండు మంది స్త్రీలు, ముప్పై మంది పిల్లలు బందీలయ్యారు. వారిని మదీనాకు తీసుకువచ్చిన తర్వాత దైవ ప్రవక్త (స) ఆదేశం మేరకు హజ్రత్ రమ్లా బిన్త్ హారిస్ (రజియల్లాహు అన్హా) గారి ఇంట్లో వారికి నివాస ఏర్పాట్లు చేయబడెను.

ఆ తర్వాత, బనూ తమీమ్ తెగకు చెందిన ఎనభై లేదా తొంభై మంది ప్రముఖులతో కూడిన ఒక ప్రతినిధి బృందం మహా ప్రవక్త (స) వద్దకు హాజరయ్యెను. ఈ బృందంలో వారి తెగకు చెందిన కొంత మంది వాక్చాతుర్యం గల కవులు, వక్తలు కూడా ఉండిరి. ప్రతినిధి బృందం నాయకుడు, కవిత్వం, ప్రసంగంలో మేము మీతో పోటీ పడాలని అనుకుంటున్నాము, అంటే ఏ జాతికి చెందిన వక్త మరియు కవి గొప్ప స్థాయికి చెందినవారో చూడడానికి ఉపన్యాసం మరియు కవిత్వంలో మాతో పోటీపడండి అని అన్నారు. దైవ ప్రవక్త (స) ఇట్లు బదులిచ్చిరి. కవిత్వం, ప్రసంగంలో ఆధిక్యత నా ప్రవక్తుత్వ లక్ష్యం కాదు. నా లక్ష్యం అల్లాహ్ తఆలా వైపుకు తీసుకురావడమే అని సెలవిచ్చారు. కానీ మీ రాక ఉద్దేశ్యం ఇదే అయితే, మీ నైపుణ్యాన్ని ప్రదర్శించండి, మేము దానికి సమాధానమిస్తాము. పోటీ తరువాత, ఈ ప్రతినిధి బృందంతో వచ్చిన అఖ్ర' బిన్ హాబిస్, తన సహచరుల ముందు స్పష్టంగా ఇలా వ్యాఖ్యానించారు. వారి వక్త మన వక్త కంటే గొప్పవాడు, వారి కవి మన కవి కంటే చాలా ఉన్నత స్థాయికి చెందినవాడు. వారు మనకంటే చాలా ముందున్నారు. అప్పుడు ఆ ప్రజలు పరస్పరం చర్చించుకొని ఇస్లాంను స్వీకరించారు. బనూ తమీమ్ ఇస్లాంను స్వీకరించిన తర్వాత మహా ప్రవక్త (స) వారి బందీలను తిరిగి వారికి అప్పగించారు, అందరిని బహుమతులు, గౌరవాలతో కూడా సత్కరించారు.

తరువాత సరయ్యా ఖుత్బా బిన్ ఆమిర్ ప్రస్తావన గలదు. ఇది హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని సఫర్ నెలలో జరిగింది. ఒక కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) వారిని ఖుబాలా వైపుకు పంపారు, మరొక కథనం ప్రకారం హుమైషా చుట్టుపక్కల ప్రాంతాలకు పంపుతూ వెంటనే వారిపై దాడి చేయమని ఆజ్ఞాపించారు. దానికి అనుగుణంగా, ముస్లింలు వెంటనే వారిపై దాడి చేశారు. తీవ్రమైన యుద్ధం జరిగింది. ఇరుపక్షాల నుండి చాలా మంది గాయపడ్డారు. ప్రత్యర్థి తెగకు చెందిన చాలా మంది హతమైనారు. హజ్రత్ ఖుత్బా యుద్ధంలో దొరికిన సంపదలో ఒంటెలు, మేకలు, స్త్రీలను మదీనా వైపు తీసుకువచ్చారు.

ఇలాగే సరయ్యా దహ్హాక్ బిన్ సుఫ్యాన్ కిలాబీ ప్రస్తావన గలదు. ఇది హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని రబీఉల్ అవ్వల్ నెలలో జరిగింది. మహా ప్రవక్త (స) దహ్హాక్ బిన్ సుఫ్యాన్ కిలాబీని ఖుర్తాఆ వద్ద నివసిస్తున్న వారి స్వంత తెగ బనూ కిలాబ్ వైపు పంపారు. ఆయన ఇస్లాం సందేశాన్ని అందించారు, కానీ తెగవారు నిరాకరించారు. ఫలితంగా పరిస్థితి యుద్ధానికి దారితీసింది. ఆయన ఖుర్తా'ఆ వాసులను ఓడించి, యుద్ధ సంపదను స్వాధీనం చేసుకున్నారు.

ఇలాగే జెద్దా వైపు జరిగిన సరయ్యా హజ్రత్ అల్ఖమా బిన్ ముజజ్జిజ్ ప్రస్తావన గలదు. ఈ

దండయాత్ర హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని రబీఉస్-సానీ నెలలో, కొన్ని కథనాల ప్రకారం సఫర్ నెలలో జరిగింది. మహా ప్రవక్త (స)కు ఏబిసీనియాకు చెందిన కొంతమంది యుద్ధవీరులు జెద్దా తీరంలో దిగారని, వారు కొన్ని కథనాల ప్రకారం మక్కా వాసులను దోచుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఆయన సల్లం హజ్రత్ అల్ఖమాను మూడు వందల మందితో కూడిన సైన్యానికి నాయకత్వం సమర్పించి వారి వైపు పంపారు. అనుచరుల రాక గురించి వారికి తెలిసినప్పుడు, ఆ ప్రజలు తమ పడవల్లో ఎక్కి సముద్రంలోకి పారిపోయారు. ఆయన ఒక ద్వీపం వరకు వారిని వెంబడించారు.

హుజూర్ అన్వర్ ఈ దండయాత్రలోని ఒక ముఖ్యమైన సంఘటన గురించి తెలుపుతు ఇట్లనిరి. ఇందులో సైన్యాధ్యక్షుడు నిప్పులోకి దూకమని ఆజ్ఞాపించడం, దానికి కొంతమంది సిద్ధపడడం. మరికొంతమంది నిరాకరించడం గురించి ప్రస్తావన ఉంది. ఈ విషయం మహా ప్రవక్త (స) దృష్టికి వచ్చినప్పుడు, ఆయన చాలా కోపగించుకొని వారు నిజంగా అందులో ప్రవేశించి ఉంటే, వారు ప్రళయం వరకు దాని నుండి బయటకు వచ్చేవారు కాదు, ఎందుకంటే విధేయత అనేది మంచి విషయంలో మాత్రమే ఉంటుందని అన్నారు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజియల్లాహు అన్హు) కూడా ఈ సంఘటనను వివరిస్తూ, షరియత్‌కు విరుద్ధమైన విషయాలలో విధేయత ఉండదని తెలిపారు.

తరువాత సరయ్యా హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) ప్రస్తావన కూడా గలదు. ఇది హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని రబీఉస్-సానీ నెలలో జరిగింది. దైవ ప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి) ను నూట యాభై మంది అన్సార్లతో కలిసి బనూ తై తెగ ఫల్స్ అనే విగ్రహాన్ని పడగొట్టడానికి పంపారు. ఆయన ఉదయం సమయంలో దాడి చేసి, వారి విగ్రహం ఫల్స్‌ను కూల్చివేశారు. చాలా మంది బందీలను, పశువుల సంపదను స్వాధీనం చేసుకున్నారు. ఇది ప్రసిద్ధ దాత హాతిమ్ తాయీ తెగ. బందీలలో అతని కుమార్తె సఫానా కూడా ఉండిరి. తెగ నాయకుడైన ఆమె సోదరుడు అదీ పారిపోయి సిరియా దేశం వైపు వెళ్ళిపోయాడు. మహా ప్రవక్త (స) హాతిమ్ కుమార్తె సఫానా పదేపదే అభ్యర్థన మేరకు ఆమెను విడుదల చేశారు. ఆమె విముక్తి పొందిన వెంటనే ముస్లింగా కూడా మారింది. దైవ ప్రవక్త (స) అనుమతితో ఆమె తన సోదరుడు అదీ వద్దకు సిరియాకు చేరుకుంది. ఆమె తన సోదరుడిని వీలైనంత త్వరగా దైవ ప్రవక్త (స) వద్దకు మదీనాకు వెళ్లమని ఒప్పించింది. దైవ ప్రవక్త (స) అదీ మతం గురించి, అతని వ్యక్తిగత విషయాల గురించి కొన్ని విషయాలు వివరించారు, వాటిలో కొన్ని అదీకి తప్ప మరెవరికీ తెలియనివి. అదీ దైవ ప్రవక్త (స) సత్ప్రవర్తనతో పాటు ఉత్తమ విషయాలన్నిటినీ చూసి నేను ముస్లిం అయ్యానని చెప్పుకునేవారు.

హజ్రత్ అలీ (రజి) నాయకత్వంలో ఈ దండయాత్ర జరిగిన కొద్ది కాలం తర్వాతనే ఆ తెగ ప్రతినిధి బృందం రూపంలో కొందరు దైవ ప్రవక్త (స) వద్దకు హాజరై ఇస్లాంను స్వీకరించారు.

తరువాత సరయ్యా ఉకాశా బిన్ మిహ్సన్ ప్రస్తావన గలదు. ఇది హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని రబీఉస్-సానీ నెలలో జినాబ్ వైపు జరిగింది. ఈ దండయాత్ర మరిన్ని వివరాలు ఎక్కువగా చెప్పబడలేదు. ఈ దండయాత్ర జరిగిందని మాత్రమే ప్రస్తావన లభిస్తుంది.

హుజూర్ అన్వర్ తబూక్ యుద్ధం గురించి కొన్ని ప్రారంభ విషయాలను తెలియజేశారు, ఇది హిజ్రీ తొమ్మిదవ సంవత్సరంలోని రజబ్ నెలలో అనగా సెప్టెంబర్ 630 క్రీ.శ.లో జరిగింది. ఇది మహా ప్రవక్త (స) శుభప్రదమైన జీవితంలోని చివరి యుద్ధం. తబూక్ అనే నీటి చెలిమ వద్ద విడిది చేయడం వలన ఈ యుద్ధాన్ని తబూక్ యుద్ధం అని అంటారు. పవిత్ర ఖుర్‌ఆన్‌లో తబూక్ యుద్ధాన్ని సాఅతుల్ ఉస్ర్ (కష్టమైన ఘడియ) పేరుతో ప్రస్తావించబడెను. ఎందుకంటే ముస్లింలు ఇందులో చాలా కష్టం,

ఇబ్బందిని ఎదుర్కోవలసి వచ్చింది. తబూక్ యుద్ధానికి ప్రాథమిక కారణం గురించి ఇట్లు తెలుస్తోంది. మక్కా విజయం, బనూ హవాజిన్ వంటి అత్యంత శక్తివంతమైన తెగ ఘోర పరాజయం, అరబ్ చుట్టుపక్కల అన్ని తెగలపై ముస్లింలకు విజయం లభించడాన్ని చూసి యూదులు, క్రైస్తవులు, దాంబికులు తమ ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయని గ్రహించారు. ఒక వైపు వారు ఆ కాలపు అత్యున్నత శక్తి గల రోమ్ చక్రవర్తిని తమ సైన్యాన్ని పంపడానికి సిద్ధం చేశారు, తద్వారా ముస్లింలు పూర్తిగా నాశనం చేయబడతారని భావించిరి. మరోవైపు, దాంబికులు మదీనాలో ఇట్లు పుకార్లను వ్యాప్తి చేయడం ప్రారంభించారు. రోమ్ చక్రవర్తి తన సైన్యాన్ని పంపుతున్నాడు, అది మదీనాలో హజ్రత్ ముహమ్మద్ (స)తో సహా అందరు ముస్లింలను పూర్తిగా నాశనం చేస్తుంది. ఈ విధంగా మహా ప్రవక్త (స) స్వయంగా సైన్యంతో పోరాడటానికి మదీనా నుండి సిరియా వైపుకు బయలుదేరే చాలా అవకాశం ఉందని , దాంబికులు మరియు ఇతర ప్రత్యర్థులు కోరుకొనిరి. రెండు సందర్భాలలోనూ – ప్రయాణ కష్టాల వల్ల లేదా రోమ్ చక్రవర్తితో పోరాటం వల్ల ముస్లింలు, మహా ప్రవక్త (స) ఖచ్చితంగా నాశనం అవుతారని వారు ఆశించారు. నఊజుబిల్లాహ్. హుజూర్ అన్వర్ ఇట్లు వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన మరిన్ని విస్తృతమైన వివరాలు ఉన్నాయి, వాటిని తర్వాత ప్రస్తావింతును. ఇన్షా అల్లాహ్!

ముగింపులో హుజూర్ అన్వర్ ఇట్లు ఉపదేశించారు. ఈ రోజు రబ్వాలోని గోల్ బజార్లో ఉన్న మస్జిద్ మెహ్దీపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఫలితంగా మన ఐదారుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఇద్దరు చాలా తీవ్రంగా గాయపడ్డారు, వారి కడుపులో బుల్లెట్లు తగిలాయి. వారికి ఆపరేషన్ మొదలైనవి కూడా జరుగుతున్నాయి. అల్లాహ్ దయతో వారి పరిస్థితి మెరుగుపడిందని ఆశిస్తున్నాము. గాయపడిన ఇతరులపై కూడా అల్లాహ్ తఆలా అనుగ్రహం చూపాలని కోరుకుంటున్నాము. ఉగ్రవాదులలో ఒకరిని మన సెక్యూరిటీ సిబ్బంది హతమార్చింది. మరొకరు పారిపోయారు. అల్లాహ్ తఆలా ఈ ఉగ్రవాదులను, చట్టాన్ని ఉల్లంఘించేవారిని, జమాఅత్ వ్యతిరేకులను త్వరగా శిక్షించుగాక! పంజాబ్‌లో వంద శాతం నేరాలు అదుపులోకి వచ్చాయని, ఇప్పుడు ఏ ఒక్క నేరగాడూ లేడని పంజాబ్ ముఖ్యమంత్రి, ప్రభుత్వం వాదిస్తున్నారు. కానీ అహ్మదీయులపై నిత్యం జరుగుతున్న దాడులు, హత్యలు, అమరులు చేయబడటం లేదా గాయపరచబడటం, వారి ఆస్తులకు నిప్పు పెట్టడం వంటి వాటిని బహుశా వారు నేరంగా పరిగణించడం లేదు! అల్లాహ్ తఆలా ఈ ప్రభుత్వాలకు కూడా జ్ఞానాన్ని ప్రసాదించుగాక! త్వరలోనే అల్లాహ్ తఆలా జమాఅత్ పక్షాన (సత్యానికి అనుకూలంగా) గొప్ప సంకేతాన్ని ప్రదర్శించుగాక!

---

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ
اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ
وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ
وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔